వ్రాసుకుంటూ వుండగా, కూతురుగారి ఊరునుంచి మనిషివచ్చి, ఆమె కిరసనాయిలు వొంటిమీద పోసుకొని, అంటించుకుని కాలిపోయిందని చెప్పాడు.

కరణము, గోడుగోడున ఏడుస్తూవున్న భార్యను వెంటబెట్టుకొని దగ్ధమై పోయిన కూతుర్ని ఆఖరిసారి చూడడానికి వెళ్లాడు.

# ప్రేమ

అర్ధరాత్రి సరిగ్గా పన్నెండు గంటలవేళ. వీధి తలుపు చప్పుడయింది.

ఇంట్లోవున్నవారు ఒక్కొక్కరే "ఎవరువారూ?" అని కేకవేశారు. ఆ ప్రశ్నకు సమాధానం రాలేదు. తలుపు చప్పుడుమాత్రం అవుతూనేవున్నది. లేచి వెళ్లి తలుపు తియ్యడానికి ఎవరికి వారికే బద్ధకంగావుంది. ఎవరూ లేవలేదు. చప్పుడు—మెల్లగా—అవుతునే వున్నది.

"ఎవరంటే మాట్లాడరేమిటమ్మా? అమ్మాయీ కనకం, వెళ్లి తలుపు తియ్యి, మీ బాబాయి అయివుంటాడు. ఆయనకు యిదే దుఃలవాటు ఎన్ని పిలిచినా పలకడు." అని వసారాలో మూలగా పడుకున్న ముసలమ్మ సణిగింది.

"వస్తున్నా వుండండి, ఎవరో" అని కనకం—కళ్లు నులుముకుంటూ నడవ గదిలోనుంచి వసారాలోకి వస్తూ అంది. ఆ జవాబుతో తలుపు చప్పుడు ఆగింది.

అగ్గిపెట్టెకోసం, రాత్రి యెప్పుడో ఆర్పి, ఎక్కడో పెట్టిన లాంతరు కోసం వెతుక్కొని, లాంతరు వెలిగించుకొని, కనకం తలుపు తియ్యడానికి వచ్చేటప్పటికి, అర్ధరాత్రివేళ నిద్రాభంగం పొందిన ఆ యింటిలోని ఇద్దరు ముగ్గురికి మళ్ళీ నిద్ర గాఢంగా పట్టింది.

పాపం! ఆ వచ్చినవారెవరికో తలుపుతీసే అవస్థ కనకానికిమాత్రం

తప్పలేదు. భర్త విడిచిపెట్టిన పడతి ఎవర్తెకైనా, పుట్టింటోమాత్రం లోకువ బ్రతుకు కాదూ!

కనకం మనసులో ఏమైనా అనుకున్నదో లేక, యిలాటి ఘర్మాయిం పులకు ఆమె అలవాటుపడిందో కాని వెళ్ళి తలుపుతీసింది.

తలుపు తియ్యడమంటే ఏమిటి? బార్లాకాదు. ఒక్క రెక్క సగం తీసిందో లేదో "నువ్వా?" అంటూ నిర్ఘాంతపడి, అలా నిలుచుండిపోయింది. వీధిలోవున్నవ్యక్తిమీద, కనకంచేతిలోవున్న లాంతరు వెలుతురు ఒక్కమాటు మాత్రమేపడింది. ఆ వెలుతురులో, తలమీద నీలిరంగు కోకకొంగుముసుగు వేసుకున్న ఒక చక్కని పాతికేళ్ళ స్త్రీ కనకానికి స్పష్టంగా కనిపించింది.

ఆ స్త్రీని చూడగానే కనకం ఎందుకో విపరీతంగా భయపడింది. త్రాచుపామును చూచిన వ్యక్తి, వెనక్కు వెనక్కు ఎలా జరిగిపోతాడో, అలాగ తలుపువెనకకు జరిగిపోయింది.

"చూడు, కనకం నేను నిన్ను ఏమీ చెయ్యడానికి రాలేదు" అని, దీనమైన సన్నని కంఠంతో, ఆ వచ్చినస్త్రీ అన్నదాకా, కనకం అలా బ్రామ్నపడి, తలుపును కవచంగా పెట్టుకొని నిలుచునేవున్నది. అ స్త్రీ మాట్లాడిన తరువాత కనకానికి కొంచెం ధైర్యం వచ్చింది.

"నువ్వెందుకొచ్చావు యిక్కడికి?" అని ప్రశ్నించింది.

"నీతో మాట్లాడడానికి" అని ఆస్త్రీ జవాబు.

"నాతో మాట్లాడవలసింది నీకూ, నీతోటి మాట్లాడవలసింది నాకూ ఏమీలేదు. అర్ధరాత్రి ఇలా వచ్చి తలుపు కొట్టడంలో నీవుద్దేశం ఏమిటి?" అని కొంచెం రోషంతో రెట్టించింది కనకం.

"కనకం—ఎందుకలా కోపగిస్తావ్, నీతోటి మాట్లాడాలని వచ్చాను. రెండే మాటలు—చూడు ఎవరైనా వింటారేమో, ఇలా వీధి అరుగుమీదకు రా. లేదా నీ పడకగదిలోకి నేను వస్తాను పద. బయట చాలా చలిగా వుంది" అని మరింత దీనంగా ప్రార్థించింది ఆ వ్యక్తి.

కనకానికి ఏమీ తోచలేదు. ఆ వచ్చిన మనిషికోరిక తీర్చకుండా,

తలుపు ఘడేల్మని బిగించి లోపలికివెళ్ళడానికి కనకానికి మనస్సొప్పలేదు.

„సరే. లోపలికిరా” అని తాను ప్రక్కకు వొదిగి, ఆ మనిషి లోపలకు రాగానే తలుపుమూసి, లాంతరు కొంచెం తగ్గించి, ఆ వ్యక్తిని తన గదిలోకి తీసుకొని వెళ్ళింది. వీళ్ళిద్దరూ లోపలికి వెడుతూవుండగా „ఎవరే, ఆ వచ్చిందీ?” అని ముసలమ్మ అడిగిందిగాని, „ఎవరూ లేదు. గడియసరిగ్గా వెయ్యక గాలికి తలుపు కొట్టుకుందిలే” అని కనకం చెప్పిన జవాబుతో ఏదో సణుక్కుంటూ ముసలమ్మ మళ్ళీ గుర్రులో పడింది.

కనకం, ఆ వచ్చినమనిషిని తన గదిలోకి తీసుకువెళ్ళి, లాంతరు పెద్దదిచేసి, ఆ పాదమస్తకమూ, అ వ్యక్తిని పరీక్షించింది.

„చాలా చిక్కిపోయావ్” అని ప్రశ్నించింది.

„అవును, చాలా పెద్దజబ్బు చేసింది.” అని, ఆ స్త్రీ అతి జాలిగా, కనకంవైపు చూసింది. ఆమెపట్ల ఎంతో కర్కశత్వాన్ని చూపుదామనుకున్నా, కనకానికి చేతకావడంలేదు. నిజానికి శత్రుత్వం చూపాలంటే, ఆ వ్యక్తికంటే వేరే శత్రువు లెవరూ కనకానికి లేరు. తనభర్తను తనకు కాకుండా చేసింది ఆ మనిషి!

„చూడు కనకం—నువ్వు అర్జంటుగా ఆయనదగ్గరకు వెళ్ళాలి. ఇప్పుడు నువ్వు ఆయనకు చాలా అవసరం” అంది ఆ వ్యక్తి.

„ఏం, ఆయనకు జబ్బుగా వుందా?” అని అమితమైన ఆదుర్దాతో అడిగింది కనకం.

„జబ్బులేదు. ఏమీలేదు. ఒకప్పుడు నువ్వు నన్ను నీభర్తను నీకు యిమ్మని అడిగావ్. అప్పుడు అది నాచేతిలో పనికాదన్నాను. కేవలం అశక్తతవల్లనుమా, ఆయన నన్ను ఎంతో ఎక్కువగా ప్రేమించారు. నేనూ ఆయన్ని అలాగే ప్రేమించాను. నువ్వు ఆయన్ని ప్రేమించడం లేదని నేననుకునా. మనిద్దరం ఆయన్ని ప్రేమించాము. ఆయనమాత్రం మనిద్దరిలో ఒకర్ని ఎక్కువగా ప్రేమించారు. నిన్ను సరిగా ప్రేమించలేదు. అందుకు నేను సంతోషించడంలేదుసుమా. నువ్వు ఆయన సుఖాన్ని ఎలా కోరావో,

నేనూ ఆయన సుఖాన్ని అలాగే కోరాను. ఆయనకోపం నువ్వు క్షమించు. వెంటనే ఆయనదగ్గరకు వెళ్ళు'' అని కనకం గడ్డం పట్టుకుని బుజ్జగించింది ఆమె.

కనకానికి ఇదంతా అయోమయంగావుంది. ఇప్పుడిది ఇంకొకడితో ఎవడితోనైనా లేచిపోతోందా! అం ఐతే. తనభర్త ఏమయితే దానికెందుకు— ఇలావచ్చి తనను ప్రాధేయపడడం జరుగుతుందా! కాదు. ఏమిటబ్బా!

"చూడు. నాకేమీ అర్థంకావడంలేదు." అంది కనకం.

"ఏముంది దీంట్లో. నువ్వు అసలు అర్థంచేసుకోడానికి ప్రయత్నించకు. నా సంగతీ అదీ మరిచిపో; తెల్లవారగానే బయలుదేరి ఆయనదగ్గరకువెళ్లు. ఆయన సుఖం నీ సుఖంగా చూచుకుంటావుకదూ! ఇంక నన్ను వెళ్ళనీ, దా, తలుపువేసుకుందువుగాని—'' అని లేచింది ఆ స్త్రీ.

తనను మించిన ఏదో ఒకశక్తికి లోబడిపోయినట్లుగా కనకం కూడా లేచింది. ఇద్దరూ తలుపుతీసుకొని వీధిలోకి వచ్చారు.

"కనకం—నామీద ఇక యెప్పుడూ కోపంగా ఉండకేం, ఏం, ఏదీ ఒక్కసారి నన్ను కౌగలించుకోనియ్యి'' అని ఆ స్త్రీ, కనకాన్ని అత్యంత తమకంతో కౌగలించుకుంది.

"ఇంత అర్ధరాత్రి ఎక్కడికి వెడతావు. రేపు వెడుదువుగానిలే. రా. లోపల పడుకుందాం'' అని కనకం అంటున్నా, వినిపించుకోకుండా, కనకం సిగ్గుపడుతూన్నా లక్ష్యపెట్టకుండా ఆమె రెండు చెక్కిళ్ళనూ గట్టిగా ముద్దుపెట్టుకొని ఆ స్త్రీ గబగబా మెట్లుదిగి వీధిలోని చీకట్లోకి నడిచిపోయింది.

దిగ్భ్రమతో కొంతసేపు అక్కడే నిలుచునీ, చాలాసేపు మంచంమీద కూర్చుని ఆలోచించీ, నిద్రపట్టక అటు యిటూ మసులుతూ, కనకం ఆరాత్రి శేషాన్ని ఎలాగో గడిపింది.

తెల్లవారిందో లేదో, నాయనమ్మ మాట లక్ష్యపెట్టక, అమ్మతో పోట్లాడి, తన సామాను సర్దుకొని బండియెక్కి, తన భర్త కాపురమున్న పేటకు అరగంటలో వెళ్ళి, భర్తవున్న యింటితలుపు కొట్టింది. లోపల్నుంచి 'తలుపు

తీసేవుంది' అని కేక వినపడగానే, గబగబా లోపలికి వెళ్ళింది.

వసారాలో నాపమీద శవం—ఆ శవం ప్రక్కనే, తలవంచుకొని దుఃఖిస్తూ తన భర్తా—మండువా దగ్గర దిగాలుపడి కూర్చుని బంట్రోతూ కనపడ్డారు.

భర్త తలయెత్తి తనవంక చూసి, „నువ్వా!" అని, వ్రేలితో శవాన్ని చూపించాడు.

ఆ శవం ఎవరో అని కనకం దగ్గరకు వెళ్ళింది.

నిన్నరాత్రి తనదగ్గరకు వచ్చినప్పుడు ఎలావుందో, అలాగేవుంది. విషం తాగింది కాబోసు!"

„అయ్యో! ఇంతపని చేస్తుందనుకోలేదు. నిన్న రాత్రి పన్నెండింటికివచ్చి, నన్ను వెంటనే మీదగ్గరికి రమ్మని బ్రతిమాలింది!" అని కనకం అంటూండ గానే, ఆమెభర్త లేచి „పన్నెండు గంటలకా!" సరిగ్గా ఆ సమయానికే దాని ప్రాణాలు పోయాయి. సరిగ్గా పన్నెంటింటికే!" అన్నాడు.

„నిజమే! అంటూ విస్తుపోయింది కనకం. కాని రెండు నిమిషాలలో ఆమెకు ఏమర్థమయిందో, „ఎంత ప్రేమగలదానివే, లక్ష్మీ" అంటూ ఆ శవాన్ని కౌగలించుకొని విలపించింది.

# అందమైన పిల్ల

గోపాలరావును నేను కలుసుకొని చాలా సంవత్సరాలయింది. మేమిద్దరం ఒకటో ఫారంనుంచీ, ఇంటర్మీడియేటు దాకా ఒకేబల్లమీద కూచుని చదివాము. ఆ తరువాత, వాడిదారి వేరు నాదారి వేరు అయింది.

హఠాత్తుగా మొన్న సెంట్రల్ స్టేషన్‌లో కనిపించాడు. ఎవరో స్నేహితుడు కలకత్తా మెయిలులో వూరికి వెడుతూవుంటే, అతణ్ణి పంపించడానికి నేను స్టేషనుకి వెళ్ళాను. అందమైన ఆడవాళ్ళు ఎవరైనా కనిపిస్తారేమో